# సిగ్గుపడవల్సిన నిజం



— గోవిందరాజు సీతాదేవి

ఉదయం.

ఆరుగంటలు కావస్తోంది.

పేపర్.... పే ...పార్...ఆంధ్ర ప్రభా, జ్యోతీ పత్రికా, ఈనాడూ పేపరు కుర్రాళ్ళు అరుస్తున్నారు.

ఈ అరుపుకి శ్రీలక్ష్మికి నిద్ర మెలుకువ వచ్చింది.

"బియస్సీ పరీక్షా ఫలితాలు వచ్చాయి....వచ్చాయి."

పేపరు కుర్రాళ్ళు సంగీతం పాడుతున్నారు.

శ్రీలక్ష్మి చటుక్కున లేచి కూర్చుంది.

వచ్చేశాయా రిజల్ట్స్ ఈ రోజు

వస్తాయని నిన్నటి పేపరులోనే వుంది. రిజల్ట్సు వచ్చాయి అనగానే ఒకవైపు ఆనందం, మరోవైపు ఏదో తెలియని టెన్షన్‌లో వుక్కిరి బిక్కిరి కాసాగింది. ఎప్పుడు రిజల్ట్సు వచ్చినా యింతే! కానీ ఈ సారి మరీ టెన్షన్ ఫీలింగ్‌గా వుంది. వుంటుంది. పాస్ అయితే చదువు పూర్తి అవుతుంది. చదువు పూర్తి అయితే పెళ్ళి ఖాయం అవుతుంది. ఆ తర్వాత....

"అమ్మాయ్. శ్రీలక్ష్మి! పేపరొచ్చిందే" తల్లి పిలుపుకి శ్రీలక్ష్మి ఆలోచనలు టక్కున ఆగిపోయాయి.

ఈ రిజల్ట్సు కోసం తనకంటే కూడా తల్లి ఎక్కువగా ఎదురు చూస్తోంది. నవ్వుకుంది శ్రీలక్ష్మి.

"శ్రీ వినపడలేదూ" తల్లి గొంతు మళ్ళీ విన్పించింది.

విన్పించని పోవటానికి ఈ ఇల్లు బంగళానా, ఒకటిన్నర గదేగా. తనకి త్వరగా పరుగెత్తి పేపరు చూడాలనే వుంది కానీ, కాళ్ళు తన ఆజ్ఞని పాటించనట్లు వుండిపోతున్నాయి. గమ్మత్తయిన మానసిక స్థితి అనుభవిస్తూ ఆ స్థితి నుంచి బైటపడటానికి విశ్వప్రయత్నం చేస్తూ ఎలాగో లేవగలిగింది. అంతే! ఒక్క పరుగున వచ్చేసింది వాకిట్లోకి. అప్పటికే చుట్టుపక్కలున్న నాలుగు వాటాల్లోని వారూ తల్లి చుట్టూ చేరి పేపరులోకి తొంగి చూస్తూ, 'నంబరు ఎంతండీ?' అని వెతుకుతున్నారు.

"నాకేం తెలిసి ఏడుస్తూ, రావే అమ్మాయ్" ఆవిడ విసుక్కుంది.

శ్రీలక్ష్మి తల్లి చేతిలోని పేపరు గబుక్కున లాక్కుంది.

అదిరే గుండెని అదిమి పట్టుకుని మెదడులో అచ్చు అయిన నంబరుని వెతుక్కోసాగింది. ఫస్ట్ క్లాస్‌లోనే వుండి తీరాలి. అని వెతికింది. లేదు.

శ్రీలక్ష్మి వళ్ళంతా చెమట పట్టేసింది. కళ్ళముందున్న నంబర్లు అలుక్కుపోయినట్లు కన్పించసాగాయి.

"నీ నంబరు లేదూ?"

"ఖంగారు పడకు."

"సరిగా చూడు."

"ఫస్ట్‌క్లాస్‌లో లేకుంటే సెకండ్ క్లాస్‌లో చూడు."

చుట్టూ వున్నవాళ్ళ రకరకాల వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. శ్రీలక్ష్మికి మతి పోతోంది ఈ మాటలకి. పేపరు తిప్పింది. ఒక్కో నంబరూ స్థిమితంగా చూడాలని ప్రయత్నిస్తోంది. కానీ తన

నంబరు మర్చిపోయింది. అంతే! ఎంత గింజుకున్నా గుర్తు రావటం లేదు.

'ఇదేమిటి, క్షణంలో యిలా జరిగిందేమిటి?' శ్రీలక్ష్మి చేతులు ఒణుకుతున్నాయి. కళ్ళలో నీళ్ళు నిండుకుంటున్నాయి.

"నీ నంబరు చెప్పు మేం వెతుకుతాం" అంటున్నారు పక్కనున్న వాళ్ళు.

"నంబరు మరిచిపోయావా! పోనీ హాలు టికెట్ తీసుకురా!" తల్లి అంది.

"అదెక్కడుందో" శ్రీలక్ష్మి గొణిగింది.

"పరీక్ష పోయిందిలా వుంది" గుసగుసలు ప్రారంభమైనాయి.

"ఏమే శ్రీ ఏమైందే?" తల్లి గాభరా.

వున్న మతి కూడా పోతూ వుంది శ్రీలక్ష్మికి.

ఇంతలో ప్రహరీ గేటు తీసుకుని లోపలికి వస్తూ, "శ్రీలక్ష్మి గారూ! కంగ్రాజులేషన్స్" తవింటికి నాలుగిళ్ళ అవతల ఓ చిన్న అద్దెగది తీసుకుని ట్యూషన్లు చెప్పి వచ్చిన డబ్బుతో చదువు సాగించుకుంటూ, తనతోబాటు బియస్సీ పరీక్షలు రాసిన సుగుణారావు తనకి అభినందనలు తెల్పుతుంటే ఆశ్చర్యంగా చూస్తూ అంది.

"మీరు నా నంబర్ పేపర్లో చూశారా!"

సుగుణారావు క్షణం తొట్రుపడినట్లు అయి మరోసారి తన చేతిలోని పేపర్లోకి చూశాడు.

"మీ చేతిలో పేపరున్నా నంబరు కన్పించలేదూ!" అన్నాడు.

"లేదు. ఎక్కడుంది?"

"నా పక్కనే వుంది. ఇదిగో యిక్కడ చూడండి వరసగా వున్న మన యిద్దరి నంబర్లనీ కలిపి సున్నా చుట్టేశాను" అంటూ వేలితో చూపించాడు.

శ్రీలక్ష్మికి టక్కున గుర్తు కొచ్చింది మర్చిపోయిన నంబరు.

సుగుణారావు జోక్‌కి చుట్టూ వున్నవాళ్ళు ఓహ్ అన్నారు. కానీ శ్రీలక్ష్మి పట్టించుకోలేదు. అతని చేతిలోని పేపరు గభాలున లాక్కుని తల్లికి చూపిస్తూ అంది.

"అమ్మా! నేను పాస్ అయాను. అయితే ఫస్ట్ క్లాస్ కాదు. సెకండ్ క్లాస్."

"ఏదో ఒక క్లాస్. పాస్ అయావు. అంతే చాలు."

ఆవిడ తృప్తి పడిపోయింది. ఇరుగూ పొరుగూ శ్రీలక్ష్మికి అభినందనలు తెల్పి వెళ్ళిపోయారు.

సుగుణారావు తను పాస్ అయానన్న మాట విన్పించుకో కున్నా కనీసం తన పేపరన్నా తిరిగి యిచ్చేస్తే చాలు అని విలు చున్నాడు. శ్రీలక్ష్మి అతన్ని గమ నించలేదని మనసు చివుక్కుమన్నా భరిస్తూ వెనక్కి తిరిగి వెళ్ళి పోయాడు.

"అమ్మా! స్నానంచేసి మా లెక్చరర్ భారతి కీ వార్త చెప్పి వస్తాను."

తల్లి యిచ్చిన కాఫీ తాగుతూ అంది శ్రీలక్ష్మి.

"వెళ్ళు. కానీ ముందు గుడికి వెళ్ళు. తర్వాత మరెక్కడికైనా వెళ్ళు."

శ్రీలక్ష్మి నవ్వేసింది.

పిచ్చి అమ్మకి మనుషులమీద కంటే దేవుళ్ళమీదే నమ్మకం ఎక్కువ. భారతిగారు ఎంతో సాయ పడ్డారు. ఆవిడకి కృతజ్ఞతలు చెప్పాలి. అనుకుంటూ స్నానానికి లేచింది శ్రీలక్ష్మి.

* * *

వాయిల్‌చీరె కట్టుకుంది. జడ వేసుకుంది. ముఖాన ఎర్రని తిలకం దిద్దుకుంది. అద్దంలో తన ప్రతి బింబాన్ని ఓసారి చూసుకుంది. ముస్తాబు చాలు అనుకుని తల్లి యిచ్చిన పువ్వులూ పళ్ళూ కొబ్బరి కాయా పట్టుకుని దేవాలయానికి బయలుదేరింది.

రోడ్డుమీదవున్న పీళ్ళ పంపు దగ్గర కూజాలో నీళ్ళు పట్టు కుంటూ కన్పించాడు సుగుణారావు.

ఎంత సామాన్య జీవితమో యితనిది. రెండే పాంట్లూ రెండే షర్టులు. వంట స్వయంగా చేసు కుంటూ గొంతు చించుకుని హైస్కూలు కుర్రాళ్ళకి చదువు చెప్తూ, ఆ డబ్బులు గీసిగీసి ఖర్చు పెట్టుకుంటూ ఎంతో కష్టంమీద బియస్సీ వరకూ రాగలిగిన ఇతనికి వుద్యోగం ఎవరిస్తారు? ఇలాంటి వాళ్ళు అంత కష్టపడి ఎందుకు చదువుతారో అర్థంకాదు ఒకవేళ ఏ చిన్న ఉద్యోగమో దొరికినా జీవితం గొర్రెతోకేగా. ఇతన్ని పెళ్ళి చేసుకున్న ఆడపిల్ల ఏం సుఖపడుతుంది? సుగుణారావు అందంగానే వుంటాడు. కానీ అందమైన దుస్తులు వేసుకోడు. ఏది ఏమైనా చదువు మాత్రం తపస్సులా సాగిస్తాడు. లేకుంటే తనతోబాటు పాస్ కాగలడా! ఫస్ట్ క్లాస్ వచ్చి వుంటే చాలా బాగుం డేది నాకు.

ఆలోచిస్తూనే సుగుణారావుని చూసి పలకరింపుగా నవ్వింది.

సుగుణారావు నవ్వలేదు.

ఏమైంది యాతనికి? ఎక్కడ కవ్వించినా తనకి తానుగా పలక రించే యాతను ఇప్పుడు సీరియస్‌గా వున్నాడేమిటి?

ఆలోచిస్తూంటే చప్పున గుర్తుకి వచ్చింది.

"మీనంబరు నా పక్కనేగా వుందీ. రెండింటికీ కలిపి సున్నా చుట్టాను. చూడండి!"

అరెరె.... పాస్ అయాననే వార్త తెచ్చిన అతనికి థాంక్స్ చెప్పనేలేదు. తమ పాస్ అయానని చెప్పినా కంగ్రాజులేషన్స్ చెప్ప లేదు. ఎంత తెలివి తక్కువగా చేశాను. అనుకుని ముందుకి వేసిన అడుగు వెనక్కి వేసి తనే పల్క రించింది.

"సుగుణారావుగారూ! కంగ్రాజు లేషన్స్."

సుగుణారావు శ్రీలక్ష్మి ముఖం లోకి చూడకుండానే, "థాంక్స్ కానీ, నా పేపరు కాస్త పంపండి. మరో పేపరు కొనుక్కునే స్తోమతు నాకు లేదని మీకు తెలుసనుకుం టాను" అంటూ కూజా తీసుకుని వెళ్ళిపోయాడు.

శ్రీలక్ష్మి నాలిక కరుచుకుంది. ఎంత పొరపాటు చేశాను అను కుంది. దేవాలయానికి వెళ్ళి తిరిగి ఇంటికి వచ్చేసింది.

భారతిగారి ఇంటికి వెడుతూ సుగుణారావు పేపరు తీసుకుని అతని రూముకి వెళ్ళింది. రూము తలుపు తాళం వేసి వుంది.

కిటికీలోనించి పేపరు లోపలకి విసిరి, లెక్చరర్ భారతి యింటికి వెళ్ళింది.

నమస్కారం అంటూన్న శిష్యురాలిని చూస్తూ నవ్వి. "పాస్ అయావు కదూ!" అంది భారతి.

"సెకండ్ క్లాస్" కాస్త విచా రంగా అంది.

"ఏదో ఒక క్లాస్. కంగ్రాజు లేషన్స్."

"థాంక్స్!"

"కూర్చో శ్రీలక్ష్మి!" అంటూ కుర్చీ చూపింది భారతి.

శ్రీలక్ష్మి కూర్చుంది.

"పరీక్ష పాస్ అయితే పెళ్ళి వెంటనే జరుగుతుంది అన్నావు యిదివరకు ఒకసారి. మరింక ఆ ప్రయత్నమేనా?"

"ఊఁ!"

"వరుడు కుదిరే వున్నాడా?"

'వూ' సిగ్గుగా అంది శ్రీలక్ష్మి.

"మారేటి చేసుకోబోతున్నావన్న మాట,గుడ్ యింతకీ యెవరతను."

"ఆంధ్రా బ్యాంక్‌లో పని చేస్తున్నాడు మధుర్ అనీ."

"మధుర్! ఈపేరు యిప్పుడే

విన్నట్లుంది." అని రెండు నిమిషాలు ఆలోచించి అక్కడే టీపాయ్ మీదవున్న శుభలేఖని తీసుకుని చూపి శ్రీలక్ష్మివైపు చూస్తూ.

"నీ ఫ్రెండ్ విజయ పెళ్ళి సెటిల్ అయిందట!" అంది.

"విజయకి పెళ్ళి కుదిరిందా! నమ్మను. నాకు తెలియకుండా ఎలా కుదిరింది. నాలుగురోజుల క్రితం కలిశాం యిద్దరం."

"మీరిద్దరూ చాలా స్నేహితులని నాకు తెల్సు. కానీ యింతకు ముందేవచ్చి యిదిగో తన పెళ్ళిలేఖ యిచ్చి వెళ్ళింది. కట్నం పాతిక వేలు యిస్తున్నాం అని కూడా చెప్పింది. ఆంధ్రా బ్యాంక్‌లో పని చేసే మధుర్‌వరుడని వుంది చూడు" శుభలేఖ అందించింది భారతి.

శ్రీలక్ష్మి నెత్తిమీద పిడుగు పడినట్లు అయింది. మనసులో పెను తుఫాను వీచసాగింది. సప్త సముద్రాలూ పొంగుతూన్నట్లు అన్పించ సాగింది.

బ్యాంక్‌లో పనివుండి వెడుతూ వస్తూన్నప్పుడైన పరిచయం అలా అలా స్నేహంగా మారి అది ప్రేమగా రూపుదిద్దుకుని సినిమాలకీ షికార్లకీ తిరిగి మరొకరిని వివాహం ఆడమని వాగ్దానాలు తీసుకుని మధుర్ యింక తనవాడే అన్న ధైర్యం వచ్చి చదువు పూర్తి కాగానే మూడుముళ్ళూ గుట్టుగా వేయించుకుని వెళ్ళి తల్లివాళ్ళకి దణ్ణంపెట్టి ఆవిడని ఆశ్చర్యపరచాలని కలలుకన్నది. చిన్నప్పుడే తండ్రిపోయినా రెక్కలకష్టంలో, చదువు పూర్తిచేయిస్తూ కూతురి పెళ్ళి యెలా చేయగలను అని లోలోపల గంపంత దిగులు పడే తల్లి మనసు మాధుర్‌లాంటి అందగాడు అల్లుడిగా చూసుకుంటే యెంత వుప్పొంగి పోతుందో, యెందరిదేవుళ్ళకి దణ్ణాలు పెట్టుకుంటుందో చూడాలన్న చిలిపి కోరికతో ఈ విషయం తల్లికి చెప్పలేదుగానీ చాలామందికి తెల్సు. ఈ ధైర్యంతోనే విజయకి పరిచయం చేసింది. రెండు మూడుసార్లు మాత్రమే తమ వెంటవచ్చిన విజయ యిలాయెలా చేయగలిగింది.

ఆశ్చర్యం కోపం దుఃఖం ఒక్కుమ్మడిగా వచ్చేశాయి శ్రీలక్ష్మికి. పైకి ఏడవలేక లోపలికి మింగలేక సతమతమవటం చూసి భారతి విషయం గ్రహించింది.

సారీ శ్రీలక్ష్మీ సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతూ వచ్చిన నీకు బాధ కలిగించే వార్త చెప్పినట్లున్నాను."

భారతి ఊరడింపుకి శ్రీలక్ష్మి దుఃఖం మరీ ఎక్కువైంది. వెక్కి-వెక్కి ఏడుస్తూ విషయమంతా వివరంగా చెప్పేసింది. చూశారా మేడమ్ స్నేహితురాలిగా నటిస్తూ మేమిద్దరం ఎంతగా ప్రేమించు కున్నామో తెలుసుకుంటూనే తను ఎంత మోసగించిందో."

"నిజంగా ఇది బాధ కలిగించే విషయమే. కానీ శ్రీలక్ష్మి ఇలా జరగటానికి కారణం ఒక్క విజయదే తప్పు కాకపోవచ్చు. పాతికవేలు కట్నం అనేసరికి మధుర్ ప్రేమా గీమా అని నీ వెంట తిరిగి నీకిచ్చిన వాగ్దానం మర్చిపోయి వుండచ్చు. ఇది క్షమించరాని నేరం. మాధుర్ విద్యాధికుడు, అందునా ఉద్యోగ స్తుడు. ఐనా ఇలా చేశాడంటే మనిషి మెదడు పెరుగుతూ వుంది. మనసు క్షీణిస్తూవుంది. ఎంత సిగ్గుపడవల్సిన నిజం ఇది.

మేడమ్ మాటలు శ్రీలక్ష్మి చెవుల్లో గింగురుమంటున్నాయి. లేచి ఇంటివేపుగా వచ్చేస్తోంది. సుగుణారావు డొక్కు సైకిల్ ఎక్కి ఎక్కడినుండో వస్తూ శ్రీలక్ష్మిని చూస్తూనే దగ్గరగా వచ్చాడు.

"సారీ శ్రీలక్ష్మిగారూ మీరిం దాక నాకు కంగ్రాజులేషన్స్ చెప్తే థాంక్స్ చెప్పనందుకు సిగ్గుపడి పోతున్నాను. పేపరు ఇవ్వలేదన్న కోపంతప్ప మరేం లేదు. ఔనూ మీరిప్పుడు ఎక్కడినుంచి వస్తు న్నారు."

శ్రీలక్ష్మి నోట్లోనుండి మాట రావటంలేదు.

అతినాగరికత ప్రదర్శిస్తూ రెండేళ్ళు వెంటతిరిగి పెళ్ళాడ తానని వాగ్దానంచేసి మరే కారణాల వలన జరగనీ విజయని పెళ్ళాడ బోతూ కూడా కనీస సభ్యత పాటించి విషయంచెప్పక దొంగలా పెళ్ళికొడుకు కాబోతున్న మధుర్. చిన్న తప్పుకి బాధపడి 'సారీ' అని తన భావాన్ని విప్పి చెప్పేసే సుగుణారావూ ఇందులో ఎవరు సంస్కారవంతులు.... ఆలోచించ సాగింది.

"మీరు అదోలా వున్నారు ఎందుకో. నేను వస్తాను" సుగుణా రావు వెళ్ళిపోయాడు. శ్రీలక్ష్మి మధుర్ గదికి వచ్చింది ఆవేశంగా. అప్పుడే స్కూటర్ దిగిన విజయా మధుర్‌లు లోపలికి వెళ్ళబోతూ శ్రీలక్ష్మిని చూసి ఒక్కున దిగి పోయారు. తప్పుచేసి పట్టుపడిన దొంగల్లా క్షణకాలం సిగ్గు పడి పోయారు. తలెత్తి శ్రీలక్ష్మి ముఖం లోకి చూడలేకపోయారు. అంత

లోనే సర్దుకుని మధుర్ శుభలేఖ అందివ్వబోయాడు. అంతే! శ్రీలక్ష్మి అతని షర్టు పట్టుకుని ఈడ్చి కొట్టింది. మధుర్ స్థాణువులా అయిపోయాడు.

విజయనీ ఈడ్చి చెంపమీద కొట్టింది. అంతే గిరుక్కున వెనక్కి తిరిగింది.

"యూ ఫూల్" మధుర్ కోపంతో శ్రీలక్ష్మి మీదకి రాబోయాడు.

రివ్వున వెనక్కి తిరిగి శివంగిలా మీదకి రాబోతున్న శ్రీలక్ష్మిని చూసి గజగజలాడాడు. వెనక్కి తగ్గాడు.

"దొంగతనానికీ దొరతనానికీ ఇంతే...ఇంతే తేడా' అనుకుంటూ చకచకా నడిచి యింటికి వచ్చేసింది. పెద్దపెట్టున వస్తున్న ఏడుపుని ఆపుకుంటూ మామూలుగా వుండా లని ప్రయత్నించసాగింది. సాధ్యం కావటంలేదు.

* * *

కొన్నాళ్ళు గడిచిపోయాయి. సుగుణారావు పేపరులో చూపిన ప్రకటనలకి అప్లికేషన్లు తను పెడుతూ శ్రీలక్ష్మినీ పెట్టండి అని చెప్తున్నాడు. హుషారుగా వుండే లక్ష్మి మూగదానిలా వుండటం చూసి సుగుణారావు ఓ రోజు అడిగాడు.

"మీ ఆరోగ్యం బాగాలేదా?"

"బాగుంది. కానీ మీరెక్కడికి వెడుతున్నారు? నేనూ వస్తాను తీసుకు వెడతారా?"

"తప్పకుండా తీసుకువెడతా మ రండి!"

"నేను నడవలేకపోతే?"

"నా చెయ్యి ఆసరా యిస్తాను. కానీ మీ కాలికేం దెబ్బ తగిలినట్లు లేదు."

ఏడుపు నవ్వుగా మారింది శ్రీలక్ష్మికి.

మరో నెల గడిచింది.

"నాకు ఉద్యోగం వచ్చిందండీ" అంటూ వచ్చాడు సుగుణారావు.

"నిజం" అంటూన్న శ్రీలక్ష్మిలో ఏదో మార్పు వచ్చి నట్లు గ్రహించాడు. అదేమిటో మాత్రం అర్థం కావటంలేదు.

మీరు చెప్తూన్న ట్యూషన్లు నా కిప్పిస్తారా?"

"తప్పకుండా."

"మీ గదిలో నాక్కాస్త చోటిస్తారా?" అన్నమాట చాలా సేపటివరకూ అర్థంకాక, అయిన తర్వాత ఆశ్చర్యానందాలతో వుక్కిరిబిక్కిరి అయినట్లుగా చూశాడు సుగుణారావు. ■